క్లుప్తంగా

బయోమెట్రిక్ తప్పనిసరి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

అమడగూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కస్సముద్రం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. తర్వాత స్టాకు వివరాలు, చిన్నారుల (0–6) బాలాధార్, హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే, ఎన్‌పీసీఎల్, ఐఎంఎంఎస్ పాఠశాలల పర్యవేక్షణ, తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించే ఏ సర్వే అయినా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరిగింది. జాబ్‌మేళాకు 3 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 64 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 22 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారులు తేజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఇర్షాద్ హుసేన్, కోఆర్డినేటర్ నాగార్జున పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: పట్టణంలోని కళాశాల సర్కిల్ వద్ద శుక్రవారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అక్కులప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని టీచర్స్‌కాలనీ వద్ద శుక్రవారం టూవీలర్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. దుర్గానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శ్రీకాంత్ తన కుమార్తె సౌమ్య, ఆమె స్నేహితురాలు నవ్యశ్రీని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వదిలిపెట్టేందుకు బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. ఇంతలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా సౌమ్య, నవ్యశ్రీలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

కదిరి అర్బన్: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కదిరి హార్టికల్చర్ ఆఫీసర్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్యాక్ హౌస్(30–20 అడుగులు) యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా రాయితీ రూ.2 లక్షలు లభిస్తుందని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్(5000 వేల మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.4 లక్షలకాగా రాయితీ రూ.1.4 లక్షలు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. పండ్లు మాగబెట్టు గదులు(20 మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.20 లక్షలు కాగా రాయితీ 7 లక్షలు, సోలార్ కోల్డ్ రూం(14 మెట్రిక్‌టన్నులు) యూనిట్ విలువ రూ.12.50 లక్షలు కాగా రాయితీ 4.37 లక్షలు, కలెక్షన్ సెంటర్(60–40 అడుగులు)యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా రాయితీ రూ.6 లక్షలు ఉంటుందని వివరించారు. వివరాలకు స్థానిక హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చెత్త సంపద కేంద్రాలపై శిక్షణ



గాండ్లపెంట: చెత్త సంపద తయారీ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న కార్యదర్శులు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రంలో శుక్రవారం చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఈఓఆర్డీ సునీత ఆధ్వర్యంలో శుక్రవారం కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు చెత్త సంపద కేంద్రాలను రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఎన్‌పీకుంట: వర్మికంపోస్ట్ తయారీపై క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనియానిచెరువు పంచాయతీ కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్తలను సేకరించి వేరుచేయాలన్నారు. వర్మికంపోస్ట్ ఎరువును పంటలకు వాడితే దిగుబడి పెరుగుతుందని సూచించారు. అనంతరం సచివాలయంలో వర్మికంపోస్ట్ తయారీపై శిక్షణ ఇచ్చారు.

చెత్తకుప్పలు.. ముప్పతిప్పలు

- 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు
- అస్తవ్యస్తంగా చెత్త నిర్వహణ
- దుర్వాసన వెదజల్లుతున్న రహదారి
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది



చెన్నేకొత్తపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన వేసిన చెత్తాచెదారం

చెన్నేకొత్తపల్లి: పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు, తడి, పొడి చెత్తను పడేస్తున్నారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తుండటంతో రోడ్డు వెంబడి చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఈ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నేకొత్తపల్లి నుంచి పెనుకొండకు వెళ్లే జాతీయ రహదారి దుర్వాసన వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు కూడా విపరీతంగా పెరిగాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను తీసుకొచ్చి ఈ పిచ్చి మొక్కల మధ్య పారబోస్తున్నారు. చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఈ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చికెన్ సెంటర్ నిర్వాహకులు పడేసే వ్యర్థాలను తినేందుకు కుక్కలు, పందులు వస్తున్నాయి. రోడ్డు దాటే క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. ఇక మృతి చెందిన కుక్కలు, పందుల కళేబరాలను జాతీయ రహదారి పక్కన పడివేయడంతో కుళ్లిపోతున్నాయి. ప్రజలు చెత్తను ఇష్టానుసారంగా పడేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారు. తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చికెన్ వ్యర్థాలు, చెత్తను జాతీయ రహదారి పక్కన వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది..

జాతీయ రహదారిపైకి వెళ్లగానే దుర్వాసన వెదజల్లుతోంది. చికెన్ సెంటర్ నిర్వాహకులు రోడ్డు పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోవడంతో వాసన వస్తోంది. సరదాగా వాకింగ్‌కు కూడా వెళ్లలేకపోతున్నాం. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, చెన్నేకొత్తపల్లి

చర్యలు తీసుకుంటాం

ఈ ప్రాంతంలో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటాం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. చెత్తను సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా చెత్తను బయట వేయకూడదు. చెత్తను తరలించే వాహనాలకు అందించాలి. జాతీయ రహదారి పక్కను వ్యర్థాలను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం.

– నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శి, చెన్నేకొత్తపల్లి

తగరకుంటలో పశు గర్భకోశ చికిత్స శిబిరం

కనగానపల్లి: జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తగరకుంట గ్రామంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామంలోని పాడి ఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడల ఉత్పత్తి చేయడంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు అధిక పాల ఉత్పత్తిని చేసే పాడి పశువులను ఎలా అభివృద్ధి చేసుకోవాలన్న విషయాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ప్రియదర్శిని, సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారులు

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



ఏపీఎంను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ రామలక్ష్మమ్మ

నల్లచెరువు: అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లోని ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ రమణారెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఓరువాయి పంచాయతీలోని సానేవారిపల్లి వీధిలో స్త్రీనిధి రికవరీపై ఏపీఎం రమణప్పను సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నించగా వ్యంగ్యంగా సమాధానం చెప్పడంతో ఆయనపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీకి సంబంధించి సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ పంచరత్నమ్మ అధికారులను కోరారు. ఎంపీడీఓ రఘునాథగుప్తా, డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవధూత ఆరాధనోత్సవాలు

ధర్మవరం రూరల్: కుణుతూరు వద్ద వెలసిన శ్రీరామ అవధూత ఆలయంలో ఆరాధనోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ పోతుకుంట కుళ్లాయిరెడ్డి ఏర్పాట్లు చేశారు.

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

ఎన్‌పీకుంట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద శనివారం ఉదయం 8.30 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందని, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పుట్టపర్తి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బుక్కపట్నంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉదయం 9–00 గంటలకు కేక్ కట్ చేయనున్నట్లు మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద శనివారం ఉదయం 9 గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమం అనంతరం కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొనాలని సూచించారు.

నేడు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు బత్తలపల్లి కూడలిలో కేక్ కటింగ్, ఆర్డీటి ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

తలుపుల: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి. పయాజ్ అహమ్మద్ తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల సర్కిల్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ మజ్జిగ అంజలి, జెడ్పీటీసీలు ఎం.గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు నాయకులు రావాలన్నారు.

తనకల్లు: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎద్దుల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఓడీచెరువు: స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద శనివారం ఉదయం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రాజు నాయుడు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

తరలిరండి..

నల్లమాడ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక వైఎస్సార్ కూడలిలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జగరాజుపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సూచనలిస్తున్న డాక్టర్లు సరిత, రవినాయక్

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నగేష్ సూచించారు. శుక్రవారం జగరాజుపల్లిలో సీజనల్ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, క్యాన్సర్ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలన్నారు. గ్రామాల్లో 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రానాయక్, ఎంఎల్‌హెచ్‌పీలు అపర్ణ, ప్రమీళ, జ్యోతి పాల్గొన్నారు.

తాడిమర్రి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం నార్సింపల్లి, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు, పెద్దకోట్ల, చిల్లకలొండయ్యపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి, రామాపురం, తాడిమర్రి తదితర గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశావర్కర్లు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటా తిరుగుతూ నీటితొట్టెలు, పాతటైర్లు, చిప్పలు, పగిలిన కుండల్లో ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం వీధుల్లో పర్యటిస్తూ మురుగునీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతం, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యం

చెన్నేకొత్తపల్లి: గర్భవతులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్లు సరిత, రవినాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో ఆసుపత్రి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న హెల్త్ అసిసెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామంలో గర్భవతులు, చిన్నారులు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకున్నారా లేదా అని తెలుసుకోవాలన్నారు. అలాంటి వారిని గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకట రమణ, హెల్త్ అసిస్టెంట్లు ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్ల పంపిణీ



పనిముట్లు అందిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం: పట్టణంలోని మస్టర్ కార్యాలయంలో శుక్రవారం నాలుగు డివిజన్లలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు కమిషనర్ ప్రమోద్‌కుమార్ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పనిముట్లు లేక ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను గుర్తించి 164 మంది కార్మికులకు పనిముట్లు అందించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్, కేశవ, మేస్త్రీలు ఆంజనేయులు, పార్థ, నరసింహులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్గో మాసోత్సవాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీఎం మైనోద్దీన్

కదిరి అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ తలపెట్టిన కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను విజయవంతం చేయాలని డీఎం మైనోద్దీన్ కోరారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో డెలివరీ మాసోత్సవాలు నిర్వహించారు. పట్టణంలో డోర్ డెలివరీలు పెద్ద ఎత్తున చేపట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రయాణికుల పార్శిళ్లను 24 గంటల్లో డెలివరీ చేస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. అనంతరం కదిరి డిపో మాజీ అసిస్టెంట్ మేనేజర్ 10 డోర్ డెలివరీలను బుక్ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ పెద్దన్న, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ అభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమని డీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ద్వారా ఒక కేజీ బరువు నుంచి 50 కేజీల వరకు డోర్ డెలివరీ ఇస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఒక్కో ఉద్యోగి మూడు కార్గో డెలివరీలు చేయించి కార్గో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఆర్టీసీ సిబ్బంది శ్రీరాములు, రామ్మోహన్‌రెడ్డి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మెడికల్ ఆఫీసర్ గౌతమి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ నారాయణ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ జగ్గా వేణుగోపాల్ గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మంజునాథ్, చంద్రశేఖర్, రామకృష్ణ, నాగరాజు, చిన్నప్ప, ఏఎన్ఎంలు పుష్పలత, నారాయణమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

ఎన్‌పీకుంట: ఎదురుదోన గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తాగునీటి సమస్యపై కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మను వినతిపత్రం అందజేశారు. వివిధ సమస్యలపై 22 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆరోగ్య ఉపకేంద్రంలో పాము, కుక్క కాటు మందులను అందుబాటులో ఉంచాలని పలువురు అధికారులను కోరారు. సర్పంచ్ నాగమునీశ్వరనాయుడు, మండల సర్వేయర్ జిలాని, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమడగూరు: చినగానిపల్లిలోని ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆరుగురు రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదులను 45 రోజుల్లోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: భూసమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిటన్లు ఆర్డీఓ వీవీఎస్ శర్మ తెలిపారు. శుక్రవారం ఎర్రగుంటపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై హోం మంత్రి వ్యాఖ్యలు తగవు

కదిరి టౌన్: కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగవని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్, బీసీ మహాజన సమితి రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, రజక సంఘం జిల్లా నాయకులు శీన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి వెంటనే పార్లమెంట్ సాక్షిగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సదుపాయాలు

నల్లమాడ: దొన్నికోట–3 అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు సర్పంచ్ రాగినేని సరస్వతి, ఎస్సార్ సీపీ నేత నాగరాజునాయుడు శుక్రవారం తెలిపారు. మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు ట్యాంక్, విద్యుత్ మోటారు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించామన్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ నిధులతో పాటు మరికొంత డబ్బు సొంతంగా వెచ్చించామన్నారు.





చట్టాలపై అవగాహన పెంచుకోవాలి





మాట్లాడుతున్న తహసీల్దార్ అనుపమ, ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: ప్రజలు వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పుట్టపర్తి తహసీల్దార్ అనుపమ పేర్కొన్నారు. ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవాన్ని పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పొందాలన్నారు. అవగాహనతోనే సరైన సేవలను పొందగలరన్నారు. ఎంఈఓ ఖాదర్‌వలి మాట్లాడుతూ విద్యార్థులను చైతన్య పరచడానికి పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కల్తీ లేని ఆహారంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సీఎస్‌డీటీ రమేస్ మాట్లాడుతూ విక్రయ కేంద్రాల్లో కొన్న ప్రతి వస్తువుకూ రశీదు తీసుకోవాలన్నారు. అనంతరం ఎనుములపల్లి నుంచి గణేష్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం గోరంట్ల మండలాధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: వినియోగదారులు తాము కొన్న ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో శుక్రవారం ఆర్డీఓ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుల హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, వినియోగదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలా ప్రభాకర్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, కరుణాసాగర్, రాజేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కుళ్లాయిరెడ్డి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు వేణుగోపాలాచార్యులు, పట్టణ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కుళ్లాయప్ప, కోశాధికారి రవీంద్ర, గౌరవాధ్యక్షుడు గోవిందు, సభ్యులు పాల్గొన్నారు.